RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 474 | 19 సెప్టెంబర్ శనివారం 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

## మా ఆస్తులు తీసుకుని

# రూ. 1,000 కోట్లు ఇవ్వండి

### : రేవంత్ కు కేటీఆర్ సవాల్



ఫార్ములా ఈ-రేస్ కేసులో నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టు విచారణకు హాజరైన అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టో హామీలను అమలు చేయడం వదిలేసి, బీఆర్ఎస్ నాయకులను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఏకైక లక్ష్యంగా మారిందని ఆయన ఆరోపించారు.కేసీఆర్ కుటుంబం రూ. లక్ష కోట్లు కొల్లగొట్టిందని సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ కేటీఆర్ ఒక సంచలన ఆఫర్ విసిరారు. “మా కుటుంబ ఆస్తులన్నింటినీ ప్రభుత్వమే తీసుకుని, దానికి ప్రతిఫలంగా మాకు రూ. వెయ్యి కోట్లు ఇస్తే ఎక్కడ సంతకం పెట్టమన్నా పెడతాను. మిగిలిన రూ. 99,000 కోట్లతో ప్రజలకు ఇచ్చిన హామీలను, సంక్షేమ పథకాలను అమలు చేయండి“ అని సవాల్ చేశారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం, పెట్టుబడులను ఆకర్షించేందుకు తాము రాత్రింబవళ్లు ప్రయత్నిస్తే, తమపై అక్రమ కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే భూకేటాయింపుల ఆరోపణలపై మాట్లాడుతుండగా, గతంలో కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి ఉందంటూ అసత్య ప్రచారం చేశారని, కానీ ఇటీవల అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డి స్వయంగా కేసీఆర్‌కు ఉన్నది కేవలం 67 ఎకరాలేనని ఒప్పుకున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా బెదిరేది లేదని, న్యాయపరంగానూ, రాజకీయంగానూ ఈ వేధింపులను ఎదుర్కొంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## కేసీఆర్, హరీశ్ రావు భూములపై పూర్తి

# ఆధారాలు ఉన్నాయి

### : పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఓవర్ లాప్ ల్యాండ్‌లో ఉన్నారని, సర్వే అనంతరం వ్యత్యాసాలు బయటపడితే ఆయనకు నోటీసులు ఇస్తామని తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. 2004 ఎన్నికల అఫిడవిట్‌లో కేవలం ఒక ఎకరం భూమి మాత్రమే ఉందని చూపించిన కేసీఆర్‌కు వందల కోట్ల విలువైన భూములు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. తమ భూముల కోసం వచ్చిన దళితులను నిలబెట్టి పసుపు నీళ్లు చల్లించిన చరిత్ర కేసీఆర్ కుటుంబానిదని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

మాజీ మంత్రి హరీశ్ రావుపై కూడా పొంగులేటి కీలక వ్యాఖ్యలు చేశారు. వట్టినాగులపల్లి భూమిపై హరీశ్ రావు మాటలు మార్చుతున్నారని, ట్రస్ట్ పేరిట భూములను దారి మళ్లించారని ఆరోపించారు. ఇరిగేషన్ మంత్రిగా ఉన్న సమయంలో రంగనాయక్ సాగర్ ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న 13 ఎకరాల భూమిని డిలీట్ చేయించి, అతి తక్కువ ధరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. అంతేకాకుండా రూ. 5.40 కోట్ల ప్రభుత్వ నిధులతో ఆ ల్యాండ్‌కు ప్రయోజనం చేకూరేలా రోడ్డు వేయించుకున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తమ వ్యాపార కుటుంబాలపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదన్న మంత్రి, ఈ భూ అక్రమాలకు సహకరించిన అధికారులు ఎంతటివారైనా సరే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, సిద్దిపేటలో ఆక్రమణకు గురైన భూముల్లో 'ఇందిరమ్మ టవర్స్' నిర్మిస్తామని స్పష్టం చేశారు.

# సుప్రీంకోర్టుకు వెళ్లను

### : దానం నాగేందర్ కీలక ప్రకటన



తనపై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పుపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. ఈ తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించే ఉద్దేశం తనకు లేదని ఆయన స్పష్టం చేశారు. హైకోర్టు తీర్పును తాను గౌరవిస్తున్నట్టు పేర్కొన్న ఆయన, మీడియా సమావేశంలో తన తదుపరి నిర్ణయాన్ని వెల్లడించారు.ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ, “ప్రజాక్షేత్రంలోనే, ఎన్నికల్లోనే అన్ని విషయాలు తేల్చుకుంటాం. నాకు ఎన్నికల్లో పోటీ చేయడం కొత్తేమీ కాదు. అనేక పోరాటాల ద్వారానే నేను ఈ స్థాయికి చేరుకున్నాను. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజల మద్దతుతో పోరాడి విజయం సాధిస్తాను“ అని ధీమా వ్యక్తం చేశారు. న్యాయపోరాటం కంటే రాజకీయంగానే దీనిని ఎదుర్కోవాలని నిర్ణయించుకున్నట్లు ఆయన పరోక్షంగా సంకేతాలిచ్చారు.గతంలో స్పీకర్ ఇచ్చిన నిర్ణయాన్ని పక్కనపెట్టిన హైకోర్టు, దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ తీర్పుపై ఉన్నత న్యాయస్థానానికి వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ, నాగేందర్ మాత్రం తన పోరాటాన్ని ప్రజాక్షేత్రానికే పరిమితం చేయాలని నిర్ణయించుకున్నారు.

## దానం నాగేందర్

# రాజీనామా చేయాలి: ఏలేటి



పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన సంచలన తీర్పును బీజేపీ తీవ్రంగా స్వాగతించింది. ఈ నేపథ్యంలో దానం నాగేందర్ సుప్రీంకోర్టుకు వెళ్లే ప్రయత్నం చేయకుండా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. దానం నాగేందర్ ఈ తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఉన్నందున, రేపే బీజేపీ తరఫున కేవియట్ పిటిషన్ దాఖలు చేస్తామని స్పష్టం చేశారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను విలీనం చేసుకోవాలనే కాంగ్రెస్ కుట్రలకు ఈ తీర్పు చెంపపెట్టు అని, ఇప్పటికైనా అధికార కాంగ్రెస్ ప్రభుత్వం బుద్ధి తెచ్చుకుని పార్టీ మారిన మిగిలిన ఎమ్మెల్యేలతో కూడా రాజీనామాలు చేయించి ఉపఎన్నికలకు వెళ్లాలని సవాల్ విసిరారు.మరోవైపు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కూడా హైకోర్టు నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ, ఇది ప్రజాస్వామ్య విజయమని అభివర్ణించారు. ఆరు నెలల వ్యవధిలోనే రాజ్యాంగబద్ధమైన తీర్పు రావడం చారిత్రాత్మకమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ తీరుకు ఈ తీర్పు సరైన సమాధానమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం, విలువలతో కూడిన రాజకీయం కోసం హైకోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలు ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకాన్ని మరింత పెంచాయని అభిప్రాయపడ్డారు.

## సిద్దిపేట భూముల్లో

# కాషాయ జెండాలు పాతుతాం

### : కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై బండి సంజయ్ తీవ్ర ధ్వజం



సిద్దిపేట భూముల వ్యవహారంపై తెలంగాణ రాజకీయం మరింత వేడెక్కింది. ఈ వివాదంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భూకబ్జాలకు సంబంధించి నిజంగా ఆధారాలు ఉంటే వెంటనే ఆ భూములను స్వాధీనం చేసుకుని కేసీఆర్ కుటుంబంతో సహా బాధ్యులైన బీఆర్ఎస్ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఆరు గ్యారంటీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కాంగ్రెస్ ఈ డ్రామాలకు తెరలేపిందని, కేసీఆర్‌తో లాలూచీ పడేందుకే అసెంబ్లీలో ప్రత్యేక విచారణ కమిషన్ వేశారా అని ఎద్దేవా చేశారు.కేసీఆర్ గతమంతా అక్రమాలు, అవినీతి, భూదందాలతోనే నిండిపోయిందని బండి సంజయ్ ఆరోపించారు. ఎన్నికల అఫిడవిట్లను పరిశీలిస్తే కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల యజమాని కాదనే విషయం స్పష్టమవుతుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకే బాటలో పయనిస్తూ పరస్పర ఆరోపణలతో కాలయాపన చేస్తున్నాయని, ఈ భూదోపిడీపై త్వరలోనే బీజేపీ ఆధ్వర్యంలో 'దండయాత్ర' చేపడతామని హెచ్చరించారు. ఆక్రమిత భూముల్లో కాషాయ జెండాలు పాతి పేదలకు పంచుతామని స్పష్టం చేసిన బండి సంజయ్, భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే రెండు పార్టీల అవినీతి, భూఆక్రమణలపై కఠిన విచారణ జరిపిస్తామని చెప్పారు.

# నందిగ్రామ్‌లో అనూహ్య మలుపు..

## కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించిన మమత!

- నందిగ్రామ్ బరి నుంచి తప్పుకున్న మమత వర్గం అభ్యర్థి - కాంగ్రెస్ అభ్యర్థికి పూర్తి మద్దతు ప్రకటించిన దీదీ
- ఇండియా కూటమి ఐక్యత కోసమే ఈ నిర్ణయమన్న మమత - బీజేపీ ఒక జుమ్లా పార్టీ అని తీవ్ర విమర్శలు



పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. నందిగ్రామ్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు తెలుపుతున్నట్లు మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. తమ పార్టీ అభ్యర్థి నామినేషన్‌ను ఉపసంహరించుకున్న నేపథ్యంలో, బీజేపీకి వ్యతిరేకంగా 'ఇండియా' కూటమి ఐక్యతను చాటేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె స్పష్టం చేశారు.

ఉప ఎన్నికకు ఇంకా నెల రోజుల సమయం ఉండగానే, మమత నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అభ్యర్థి సంచితా ప్రధాన్ అనూహ్యంగా తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఈ పరిణామంతో తాము మరో అభ్యర్థిని బరిలోకి దించబోమని, కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌కు పూర్తిస్థాయిలో మద్దతిస్తామని మమతా బెనర్జీ వెల్లడించారు.ఈ సందర్భంగా మమత బెనర్జీ మాట్లాడుతూ, “మేము పోరాటానికి సిద్ధంగా ఉన్నాము. దేశం నుంచి బీజేపీని తరిమికొట్టడమే మా లక్ష్యం. ఇండియా కూటమికి మా పూర్తి సంఘీభావం ఉంటుంది“ అని పేర్కొన్నారు. అంతకుముందు రోజు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తనకు ఫోన్ చేశారని, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సైతం మద్దతు తెలుపుతూ సందేశం పంపారని ఆమె వివరించారు. ఇదే క్రమంలో బీజేపీని ఒక 'జుమ్లా పార్టీ'గా ఆమె అభివర్ణించారు.రాష్ట్ర సచివాలయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి సువేందు అధికారిని కలిసిన తర్వాత సంచితా ప్రధాన్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడం గమనార్హం. కాగా టీఎంసీలోని రెండు వర్గాలకు ఎన్నికల సంఘం కొత్త గుర్తులను కేటాయించింది. మమత వర్గానికి 'ఫుట్‌బాల్ ప్లేయర్', ప్రత్యర్థి వర్గానికి 'ఎన్వలప్' గుర్తులను కేటాయించిన సంగతి తెలిసిందే.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
19 సెప్టెంబర్ శనివారం 2026

# గుమ్మడవెల్లి లో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు



**( హైదరాబాద్ ఇస్టే సంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 18:)**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం గుమ్మడవెల్లి గ్రామంలో నాగటిరాజు బూత్ అధ్యక్షులు జాతీయ జెండా ఎగరవేయడం జరిగింది ఈ కార్యక్రమానికి బూత్ అధ్యక్షులు మాట్లాడుతూ దేశంలో 90 47 ఆగస్టులో భారతదేశానికి స్వాతంత్రం వస్తే మన తెలంగాణలో 13 నెలలు ఆలస్యంగా వచ్చింది అని అన్నారు దీనికి తెలంగాణ ప్రజలు ఎన్నో పోరాటాలు త్యాగాలు చేసి రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటాలు చేసింది అన్నారు ఆనాటి హోం మంత్రి ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవతో తెలంగాణ స్వేచ్ఛ రాష్ట్రంగా నిర్మాణం అయింది గత రజాకారుల చరిత్రను టిఆర్ఎస్ కాంగ్రెస్ లు తొక్కి పడుతున్నాయన్నారు బిజెపి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విమోచన దినంగా సిరువాంచి తెలంగాణ స్వాభిమానాన్ని నిలబెట్టిందన్నారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గౌరప్రభాకర్ పీఎస్సీ డైరెక్టర్ గౌర వెంకటేష్ ఏ కుల మల్లేష్ భూత్ అధ్యక్షులు నాగటి రాజు తాళ్ల విష్ణు గౌడ్ వార్డ్ మెంబర్స్ గడిగ మహేందర్ సభావత్ సురేష్ సభావత్ మోతిలాల్ తుంట నరసింహ కే మాధవాచారి గ్రామంలో ఉన్న మహిళలు ఈ కార్యక్రమాన్ని పాల్గొని విజయవంతం చేయడం జరిగింది

# పెట్టుబడులకు స్వర్గధామం ఫ్యూచర్ సిటీ: కేఎల్ఆర్

## ఫ్యూచర్ సిటీలో ఎస్ బిఐ డేటా సెంటర్ కు 10 ఎకరాలు కేటాయింపు

## క్యూ కట్టిన అమెజాన్, టిసిఎస్ , ఫార్చున్ కంపెనీలు

## త్రిబుల్ ఆర్, 330 ఫీట్ల గ్రీన్ ఫీల్డ్, విమానాశ్రయంతో మారిన ముఖచిత్రం

## విద్యుత్, రోడ్లు, వాటర్, డ్రైనేజీ వసతులకు ఎఫ్ సిడిఏ పెద్దపీట



**( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 18:)**

భారత్ ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు ఫార్చున్ కంపెనీలు, ఎడ్యుకేషన్, మెడికల్ హబ్స్ క్యూ కడుతున్నాయని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. తాజాగా ఎస్ బిఐ డేటా సెంటర్ కు కందుకూరు మండలం మీర్ఖాన్ పేటలో 10ఎకరాలు కేటాయించేందుకు తెలంగాణ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి అంగీకరించారు. ఇప్పటికే అమెజాన్, టిసిఎస్ , హాస్పటాలిటీ ప్రాజెక్టులు అతిపెద్ద డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకొచ్చాయి. డిసెంబర్ 7నుంచి 9 వరకు రెండో గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తామని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని ఖూ= గుర్తు చేశారు. ఈ సమ్మిట్ లో ప్రపంచ దిగ్గజ ఐటీ కంపెనీలు సహా జాతీయ, అంతర్జాతీయ విద్య, వైద్య సంస్థలు పాల్గొంటాయని చెప్పారు. స్టార్టప్, క్లౌడ్ కంపెనీలకు సైతం కేరాఫ్ అడ్రస్ గా భవిష్యత్ నగరం మారనుందని... వచ్చే కంపెనీలకు మౌలిక వసతుల కల్పనలో రాజీ లేకుండా పూర్తి ఏర్పాట్లు చేస్తున్నామని లక్ష్మారెడ్డి అన్నారు. స్కిల్ యూనివర్శిటీతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మరోసారి స్పష్టం చేశారు కిచ్చెన్నగారు. బిల్డింగ్ నిర్మాణ పనులు సైతం వేగంగా జరుగుతున్నాయని కేఎల్ఆర్ చెప్పారు. మహేశ్వరం మండలం మొత్తం ఫ్యూచర్ సిటీలో విలీనం చేస్తే శరవేగంగా మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఎంపీ నిధులతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



**హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి కృష్ణాచారి సెప్టెంబర్ 18**

మహేశ్వరం నియోజకవర్గం కందుకూర్ మండల కేంద్రం లోని కొలనుగూడ గ్రామ పంచాయతీ గ్రామంలో ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి నిధులుతో రూ. 5.00 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులు నిర్మాణానికి కొలను గూడ గ్రామ పంచాయతీ సర్పంచ్ గొరికెల బీరప్ప, ఉప సర్పంచ్ బండ వేణు, పాలకవర్గంతో గ్రామ పెద్దలతో కలిసి సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లా డుతూ, కొలను గూడ పంచాయతీ పరిధిలో 5.00 లక్షల కేంద్రం ఎంపీ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ల, గ్రామంలో సరైన రోడ్లు లేక వర్షాకాలంలో బురద నీదితో, గుంతలతో పాఠశా లలకు విద్యార్థులు వెళ్లాలను, మహిళలు, పెద్దలు వద్ద ఇబ్బందులు పడుతున్నారని సందర్భంగా గ్రామ అభివృద్ధికి మన ప్రజల రవాణా కష్టాలను తీర్చడానికి నాణ్యమైన రోడ్లు నిర్మించడమే నా మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా గ్రామ పంచాయతీ అధ్వర్యంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు,

కార్యక్రమంలో సర్పంచ్ గురికేల బీరప్ప, ఉప సర్పంచ్ బండ వేణు,
వార్డ్ మెంబర్స్ బండ జగన్,
రాసూరి కరణ్ జ్యోతి, ఆదరణ వెంకటేష్, ఆదరణ సుహాసిని, విలేజ్ సెక్రటరీ శ్రీనివాస్ చారి, గ్రామ పెద్దలు పోతురాజు యాదయ్య, సయ్యద్ నజీర్, సోమ గణేశ, వేల్పుల అంజయ్య, పోతురాజు లక్ష్మయ్య, వేల్పుల శ్రీనివాస్, బండ శంకరయ్య, ఆధార్ సామయ్య, వేల్పుల కలమ్మ, గ్రామ ప్రజలు పాల్గొనడము జరిగింది.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

## - మోసానికి గురైతే గోల్డెన్ అవర్‌లో 1930కు ఫోన్ చేయాలి : రిసోర్స్ పర్సన్ రమేష్




**ముగ్ధుంపురం, సెప్టెంబర్ 18, హైదరాబాద్ ఎస్టేట్:**

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, మోసానికి గురైన వెంటనే గోల్డెన్ అవర్‌లో 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైమ్ రిసోర్స్ పర్సన్ రమేష్ సూచించారు. ముగ్ధుంపురం గ్రామంలో శ్రీ ధరణి స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కల్లెపు శోభారాణి ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో స్వయం సహాయక సంఘాల మహిళలు, రైతులు, యువకులు, విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ మోసపూరిత యాప్‌లు, లింకులు, ఫోన్ కాల్స్ ద్వారా సైబర్ నేరగాళ్లు ప్రజలను ఆకర్షించి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు కాజేస్తున్నారని తెలిపారు. డిజిటల్ అరెస్టుల పేరుతో కుటుంబ సభ్యులు ఆపదలో ఉన్నారని, నేరానికి పాల్పడి పట్టుబడ్డారని భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని చెప్పారు. ఇలాంటి సమయంలో కంగారు పడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్ గేమ్స్ పేరుతో డబ్బులు కోల్పోయిన కొందరు భయం, అవమానంతో సమస్యను బయటకు చెప్పుకోలేక తీవ్ర నిర్ణయాలకు వెళ్తున్నారని, ఇలాంటి పరిస్థితులకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, పిన్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులను తెరవడం లేదా ఫార్వర్డ్ చేయడం చేయరాదని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకునే విషయంలోనూ జాగ్రత్త వహించాలని తెలిపారు. డబ్బు సంపాదించడం ఎంత ముఖ్యమో, దాన్ని భద్రంగా దాచుకోవడం, కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. సేర్ప్ ఏపీఎం తిలక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బీమా, పెన్షన్, పొదుపు, రుణాలు, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, బ్యాంకు ఖాతాల నిర్వహణ, కేవైసీ, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ, డిజిటల్ లావాదేవీలు, ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సేర్ప్ సీసీ మాణిక్యం, వీఓలు జ్యోతి, రమ, తిరుమల, సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ కీర్తన, కళాకారులు వంశీ, గణేష్, స్వయం సహాయక సంఘాల మహిళలు, రైతులు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి గుర్తింపు

## - నిమ్మ అంజిరెడ్డి



**( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 18:)**

భారతీయ జనతా పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి గుర్తింపు లభిస్తుందని భారతీయ జనతా పార్టీ కందుకూరు మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి అన్నారు మండల పరిధిలోని దెబ్బడ గూడ గ్రామానికి చెందిన సామల దయాకర్ రెడ్డిని యువమోర్చా మండల అధ్యక్షునిగా నియమిస్తూ నియామక పత్రం అందించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ...పార్టీ కి నిరంతరం సేవ చేస్తూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి యువకులను చైతన్యపరిచి పార్టీ అభివృద్ధికి పటిష్టతకు కృషి చేయాలని తెలిపారు నూతన యువమోర్చా అధ్యక్షులు దయాకర్ రెడ్డి మాట్లాడుతూ... నమ్మకంతో యువమోర్చా మండల అధ్యక్షుని గా బాధ్యత అప్పగించిన పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి కి మండల పార్టీ సీనియర్ నాయకులు పెద్దలు బొక్క నరసింహారెడ్డి కి ఎల్మెట్ దేవేందర్ రెడ్డి కి జిట్టా రాజేందర్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు

# వినాయక మండపాల్లో మొద్దు లచ్చి రెడ్డి ప్రత్యేక పూజలు



**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 18:-**

బి.ఎన్.రెడ్డి నగర్: వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు, నిమజ్జన వేడుకల సందర్భంగా బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి డివిజన్ పరిధిలోని పలు వినాయక మండపాలను సందర్శించారు. సాహెబ్‌నగర్‌లోని ఆర్యభట్ట స్కూల్, ఎన్జీవోస్ కాలనీ బస్‌స్టేషన్, విజయపురి కాలనీ, బి.ఎన్.రెడ్డి నగర్ ఫేజ్-1, గౌతమి నగర్ కాలనీలలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొద్దు లచ్చి రెడ్డి మాట్లాడుతూ, విఘ్నేశ్వరుడి కృపతో డివిజన్ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించిన యువత, ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు. అనంతరం పలు మండపాల వద్ద నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా కౌన్సిల్ మెంబర్ శ్రీధర్ రావు, డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, పార్టీ నాయకులు సుధీర్ కుమార్, రాజేష్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# హిందీపై వాద ప్రతివాద పోటీలు

## - హిందీ వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు కార్యక్రమం



**బిచ్కుంద, సెప్టెంబర్ 18, హైదరాబాద్ ఎస్టేట్:**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి, బిచ్కుందలో నిర్వహిస్తున్న హిందీ వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు వాద ప్రతివాద పోటీలు నిర్వహించారు. సామాజిక మాధ్యమాల్లో హిందీ భాష భవిష్యత్తు అనే అంశంపై జరిగిన పోటీల్లో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా హిందీ విభాగాధిపతి డాక్టర్ జి. రమేష్‌బాబు సామాజిక మాధ్యమాల్లో హిందీ భాష భవిష్యత్తుపై వివరించారు. విద్యార్థుల చురుకైన భాగస్వామ్యాన్ని ప్రిన్సిపాల్ అభినందించారు. డాక్టర్ కొడకంటి అశోక్ న్యాయ నిర్ణేతగా వ్యవహరించగా, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు కాంగ్రెస్ పార్టీ మండల బాడీ కమిటీ సమావేశానికి ఆహ్వానం మల్లేష్ యాదవ్



**( హైదరాబాద్ స్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 18:)**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ మండల్ బాడీ కమిటీ ఏర్పాటుకు సమావేశం.. మాజీ శాసనసభ్యులు మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ కీచ్చన్న గారి లక్ష్మారెడ్డి (కెఎల్ఆర్) ఆదేశాల మేరకు తుక్కుగూడ కేఎల్ఆర్ కార్యాలయంలో.. శనివారం ఉదయం 10:00 గంటలకు మహేశ్వరం మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేష్ యాదవ్.. మాట్లాడుతూ మండల్ బాడీ కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సర్పంచులు,మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు, మాజీ జడ్పిటిసిలు,మాజీ ఎంపీపీలో యువజన కాంగ్రెస్ నాయకులు మరియు ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తప్పక ఈ యొక్క సమావేశానికి రావాలని మహేశ్వరం మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేష్ యాదవ్ కార్యకర్తలను అభిమానులను కోరారు

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
19 సెప్టెంబర్ శనివారం 2026

# జన్ను నర్సయ్యకు ఎస్సీ విభాగంలో బాధ్యత

## - జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం ప్రచార కార్యదర్శిగా నియామకం



**వరంగల్, సెప్టెంబర్ 18: హైదరాబాద్ ఎస్టేట్:**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ గొర్రెకుంటకు చెందిన జన్ను నర్సయ్యను వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం ప్రచార కార్యదర్శిగా నియమించారు. జిల్లా ఎస్సీ విభాగం చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ నియామక పత్రాన్ని విడుదల చేయగా, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చేతుల మీదుగా నర్సయ్య నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఎస్సీ వర్గాల ప్రజలకు చేరవేయడంతో పాటు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. దళితుల సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లి, ఎస్సీ వర్గాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తనకు బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, జిల్లా ఎస్సీ విభాగం చైర్మన్ చిలువేరు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటి కొమారెడ్డి, 15వ డివిజన్ అధ్యక్షుడు కందుల అశోక్, కంటెస్టెడ్ కార్పొరేటర్ ఎలగొండ ప్రవీణ్‌తో పాటు సహకరించిన నాయకులు, కార్యకర్తలకు నర్సయ్య కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షుడు ల్యాదల్ల ఆనంద్ (చిన్న) పాల్గొన్నారు.

# రాజ్యాంగ నిబంధనలకు ప్రాధాన్యం..

# దానం కేసుపై తీర్పు



**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 18:-**
హైదరాబాద్: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సంబంధించిన అనర్హత వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పుపై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటీ) స్పందించారు. న్యాయస్థానం నిర్ణయం ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగ నిబంధనల ప్రాధాన్యతను మరోసారి స్పష్టం చేసిందని పేర్కొన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్ అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయనపై అనర్హత వేటు వేయాలంటూ పిటిషన్లు దాఖలయ్యాయి. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా హైకోర్టు స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టి దానం నాగేందర్ అసెంబ్లీ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తీర్పు ఇచ్చింది. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా మారింది. ఈ తీర్పు పార్టీ మార్పుల అంశంలో కీలక పరిణామంగా నిలిచిందని బంటీ పేర్కొన్నారు. ప్రజల తీర్పుతో ఏర్పడిన ప్రభుత్వ వ్యవస్థల్లో రాజ్యాంగ విలువలు, చట్టబద్ధమైన విధానాలు అత్యంత ముఖ్యమని ఆయన అన్నారు. బీఆర్ఎస్ చేపట్టిన న్యాయపరమైన ప్రక్రియలో ఈ పరిణామం ప్రాధాన్యతను సంతరించుకుందని తెలిపారు.ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ హక్కుల కోసం తమ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. హైకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ శ్రేణులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు.

# ఉపాధ్యాయులు రాక పాఠశాల మూత

## రెండు రోజులుగా విద్యార్థులకు బోధనకు దూరం

## సెలవుపై వెళ్లిన ఉపాధ్యాయురాలు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేవని తల్లిదండ్రుల ఆవేదన




**కౌడిపల్లి హైదరాబాద్ ఎస్టేట్ సెప్టెంబర్ 18**
మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని పీర్యా తండా గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న యం పి పి యస్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గత రెండు రోజులుగా మూతపడినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు బోధనకు దూరమవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.స్థానికుల వివరాల ప్రకారం.. పాఠశాలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగి దొడ్ల విజయను పాఠశాల మూతపడటంపై ప్రశ్నించగా, తాను సెప్టెంబర్ 17 నుంచి 22వ తేదీ వరకు సెలవులో ఉన్నట్లు తెలిపినట్లు పేర్కొన్నారు. ఇదే విషయాన్ని మండల విద్యాశాఖ అధికారిని యం ఈ ఓ అడగగా, సదరు ఉపాధ్యాయురాలు సెలవు పెట్టిన విషయం తనకు తెలియదని సమాధానం ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు.

**గత నెలలోనూ 14 రోజుల సెలవు?**

సదరు ఉపాధ్యాయురాలు గత నెలలో కూడా సుమారు 14 రోజుల పాటు సెలవులో ఉన్నప్పటికీ, విద్యార్థులకు బోధన కొనసాగించేందుకు ప్రత్యామ్నాయ ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తరచూ ఉపాధ్యాయులు సెలవులకు వెళ్లడం, ప్రత్యామ్నాయ బోధనా సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్ల తండా ప్రాంతంలోని విద్యార్థుల చదువుకు తీవ్ర అంతరాయం కలుగుతోందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

**అధికారుల చర్యలు తీసుకోవాలని డిమాండ్**

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతున్నప్పటికీ, ఇలాంటి పరిస్థితుల వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, సెలవుల సమయంలో ప్రత్యామ్నాయ ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.పీర్యా తండా ప్రభుత్వ పాఠశాలను సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే పరిశీలించి, వాస్తవ పరిస్థితులను తెలుసుకుని, విద్యార్థుల విద్యకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే మీడియా ప్రతినిధులు ఈ సమస్యను వెలుగులోకి తీసుకువచ్చి, విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలని వారు కోరుతున్నారు.

# రోడ్లకు మోక్షమెప్పుడో.. అసెంబ్లీలో గళమెత్తిన మల్‌రెడ్డి రంగారెడ్డి

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 18:-**

ఇబ్రహీంపట్నం: నియోజకవర్గ పరిధిలో కొంతకాలంగా కొనసాగుతున్న రహదారి పనులకు సంబంధించిన సమస్యలు శాసనసభ దృష్టికి వెళ్లాయి. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సభలో ప్రస్తావిస్తూ, వివిధ ప్రాంతాల్లో చేపట్టిన రోడ్డు పనులను వేగవంతం చేయాలని కోరారు. ఇబ్రహీంపట్నం నుంచి రాయపోల్, ముకునూర్, దండుమైలారం, నాగన్‌పల్లి, పోల్కంపల్లి వైపు వెళ్లే ప్రధాన రహదారిపై అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ, అవి ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదని ఎమ్మెల్యే సభకు వివరించారు. రహదారి తవ్వకాలు పూర్తయిన తరువాత పనులు నిలిచిపోవడంతో ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులకు సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు.
అదేవిధంగా నాగార్జునసాగర్ ప్రధాన మార్గం నుంచి యాచారం మండలంలోని నందివనపర్తి, కుర్మిద్ద, మల్కీజ్‌గూడ, మేడిపల్లి తదితర గ్రామాల మీదుగా ఫ్యూచర్‌సిటీ వైపు వెళ్లే మార్గాల పరిస్థితినీ ఎమ్మెల్యే సభలో ప్రస్తావించారు. సంబంధిత పనులు పూర్తికాకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.
ఎమ్మెల్యే ప్రస్తావించిన అంశాలపై రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించారు. ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణ కాలానికి



సంబంధించిన పరిస్థితుల కారణంగా కొంత ఆలస్యం చోటుచేసుకుందని తెలిపారు. మిగిలిన పనులను తిరిగి చేపట్టి త్వరితగతిన పూర్తి చేసే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

## - మూడు పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఎస్ఎఫ్ఐ డిమాండ్

**పరకాల, సెప్టెంబర్ 18, హైదరాబాద్ ఎస్టేట్:**

పరకాల పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ పరకాల మండల అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్ ఆధ్వర్యంలో ఎస్వీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరకాల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వెంటనే అదనపు గదులు ఏర్పాటు చేయాలని కోరారు. రాజీపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకే గది ఉండటంతో విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, నూతన భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. మల్లారెడ్డి ప్రభుత్వ పాఠశాలకు కూడా నూతన భవనం నిర్మించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు జాప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని బొచ్చు కళ్యాణ్ కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు



చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు రాహుల్, నాయకులు మహేష్, నరేష్, విజయ్, రాకేష్, వినయ్ పాల్గొన్నారు.

# ఉద్యమకారులంతా తరలిరావాలి

## ఈనెల 27న యాదగిరిగుట్టలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం 9వ వార్షికోత్సవం

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చిట్యాల మండల అధ్యక్షులు జన్నె యుగేందర్

**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**
తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చిట్యాల మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో "హలో కళాకారుడా..
చలో యాదగిరిగుట్ట" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చిట్యాల మండల అధ్యక్షులు జన్నె యుగేందర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 27న యాదగిరిగుట్టలో 9వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల సంక్షేమం, హక్కుల కోసం ఫోరం గత తొమ్మిదేళ్లుగా నిరంతరం పోరాడుతోందన్నారు. ఫోరం ఫౌండర్, రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీను ఆధ్వర్యంలో ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు యుగేందర్ తెలిపారు. ఎన్నికలకు ముందు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి సంబంధించిన అంశాలను వివరించి, ఎన్నికల మేనిఫెస్టోలో వాటిని పొందుపరిచేలా కృషి చేసినట్లు



పేర్కొన్నారు.
ఈనెల 27న యాదగిరిగుట్టలో జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఫోరం 9వ వార్షికోత్సవ వేడుకలకు రాష్ట్రంలోని ఉద్యమకారులందరూ పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జన్నె యుగేందర్ కోరారు.
ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కాట్రేవుల కుమార్, గౌరవ అధ్యక్షులు సాధ మల్లయ్య, ప్రధాన కార్యదర్శి కన్నబోయిన అశోక్, కోశాధికారి కంచర్ల కుమారస్వామి, ఉపాధ్యక్షులు సంఘ రాజేందర్, జాలిగపు కృష్ణయ్య, కార్యదర్శులు బయగాని గణపతి, వేముల శీను, గౌరవ సలహాదారులు చెక్క నర్సయ్య, ఉద్యమకారుల నాయకులు బొట్ల రవి, గొర్రె సతీష్, శ్రీరామ్ సదయ్య ,భోగం నర్సయ్య, బానోతు రాజు నాయక్, రాయిని శ్రీకాంత్, దేవరకొండ సత్యనారాయణ, ధారావత్ రాజు నాయక్, ఉప్పుల కిరణ్, బండారి శ్రీను, పరమేశ్వర్, బండి శీను, తదితరులు పాల్గొన్నారు

# నిజాంల నిరంకుశ పాలన నియంతృత్వానికి మారుపేరు

## : డాక్టర్ సమత

## ఆపరేషన్ పోలోతోనే హైదరాబాద్ సంస్థానానికి విముక్తి

## నాటి పోరాట చరిత్రను పాలకులు మరుగున పరుస్తున్నారు: బీజేపీ ఆగ్రహం

**హైదరాబాద్, సెప్టెంబర్ 16:**
నాటి హైదరాబాద్ సంస్థానంలో నిజాంల పాలన నియంతృత్వానికి, అరాచకాలకు మారుపేరుగా సాగిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ సమత విమర్శించారు. రజాకార్ల అకృత్యాలకు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన ప్రజా పోరాటాల ఫలితంగానే హైదరాబాద్ సంస్థానానికి విముక్తి లభించిందని ఆమె పేర్కొన్నారు.
ఈ సందర్భంగా బర్కత్ పుర లో ఆమె మాట్లాడుతూ... దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చి యావత్ భారతావని సంబరాలు చేసుకుంటుంటే, హైదరాబాద్ సంస్థానం మాత్రం నిజాంల చేతిలో బందీగా ఉండి స్వేచ్ఛ కోసం పోరాడాల్సి రావడం అత్యంత దురదృష్టకరమన్నారు. నిజాం అండతో ఖాసిం రజ్వీ ఆధ్వర్యంలోని రజాకార్లు సాగించిన మారణకాండకు భైరాన్‌పల్లి, పరకాల, వెయ్యి ఊడల మర్రి వంటి ప్రాంతాలు ఇప్పటికీ సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయని గుర్తుచేశారు.
నాటి కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ దృఢ సంకల్పంతో చేపట్టిన 'ఆపరేషన్ పోలో' సైనిక చర్య సెప్టెంబర్ 13న ప్రారంభమై, సెప్టెంబర్ 17న నిజాం మెడలు వంచిందని, దీంతో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని వివరించారు. నాటి సంస్థానంలో తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటకలోని పలు ప్రాంతాలు ఉండేవని, ఈ ప్రాంత ప్రజలు చేసిన వీరోచిత పోరాటాలను, అమరుల త్యాగాలను గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు రాజకీయ లబ్ధి కోసం మరుగున పడేస్తున్నాయని ఆరోపించారు.
నిజాం అరాచకాలను ఎదిరించి దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ, కాళోజీ నారాయణరావు, కొమురం భీమ్, రావి నారాయణరెడ్డి, సర్దార్ సర్వాయి పాపన్న వంటి ఎందరో యోధులు ప్రాణాలర్పించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. సెప్టెంబర్



17 అనేది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ దినమని, నాటి నిరంకుశ పాలన, అమరవీరుల త్యాగాల గురించి భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డాక్టర్ సమత స్పష్టం చేశారు.

# రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో జై స్వరాజ్ పార్టీ పోటీ

## జై స్వరాజ్ పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ వెల్లడి

**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి హైదరాబాద్**

హైదరాబాద్: విద్యావంతులు, పట్టభద్రులు ప్రజాస్వామ్యంలో తమకు ఉన్న ప్రత్యేక ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో చైతన్యవంతమైన నిర్ణయం తీసుకోవాలని జై స్వరాజ్ పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ పిలుపునిచ్చారు.

“విద్యావంతులారా! ఉత్తమ నిర్ణయానికి సమయం ఆసన్నమైంది. రండి... మన రాజ్యం మనం ఏలుదాం. మీ ఓటు హక్కును నమోదు చేసుకోండి” అని ఆయన కోరారు.

జై స్వరాజ్ పార్టీ రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేయనున్నట్లు శ్రీ రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ ప్రకటించారు.

విద్యావంతుల ఓటు భవిష్యత్తుకు దిశానిర్దేశం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కేవలం ఒక వ్యక్తిని ఎన్నుకునే ఎన్నికలు మాత్రమే కాదని, విద్యావంతుల సమస్యలు, యువత భవిష్యత్తు, ఉపాధి అవకాశాలు, విద్యా వ్యవస్థ, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, పారిశ్రామిక అవకాశాలు, సామాజిక–ఆర్థిక భద్రత వంటి అంశాలపై ప్రజా ప్రతినిధిత్వానికి సంబంధించిన ఎన్నికలని ఆయన అన్నారు.

డిగ్రీ చదివిన ప్రతి అర్హత కలిగిన వ్యక్తి తన పేరు గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని, లేకపోతే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నమోదు చేసుకోవాలని సూచించారు.

ఎన్నికల సంఘం ప్రకారం గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో ఓటరుగా నమోదు కావడానికి ఫారం18 ద్వారా దరఖాస్తు చేయాలి. అర్హతకు సంబంధించిన పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.

“ఓటు హక్కు నమోదు చేసుకోవడం మొదటి అడుగు”

“ఓటు వేయడం కంటే ముందే ఓటు హక్కును నమోదు చేసుకోవాలి. మన సమస్యలను మనమే చర్చించాలి. మన భవిష్యత్తుపై మనమే నిర్ణయం తీసుకోవాలి. విద్యావంతులు రాజకీయ ప్రక్రియకు దూరంగా ఉంటే, తమ తరపున నిర్ణయాలు తీసుకునే అవకాశం ఇతరులకు అప్పగించినట్టే అవుతుంది” అని కాసాని శ్రీనివాసరావు గౌడ అన్నారు.

గ్రాడ్యుయేట్ల ప్రధాన సమస్యలపై జై స్వరాజ్ పోరాటం

జై స్వరాజ్ పార్టీ గ్రాడ్యుయేట్ల సమస్యలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, యువతకు భవిష్యత్ రోడ్‌మ్యాప్, ఉపాధి మరియు స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లకు ప్రోత్సాహం, విద్యా రంగంలో నాణ్యత, గ్రామీణ ప్రాంతాల్లో విద్యావంతులకు అవకాశాల కల్పన, కుటుంబ ఆర్థిక భద్రత వంటి అంశాలను ప్రధానంగా చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.

“డిగ్రీ పూర్తయింది... తరువాత ఏంటి? అనే ప్రశ్నకు సమాధానం ఇచ్చే రాజకీయ వ్యవస్థ కావాలి. విద్యను కేవలం సర్టిఫికెట్‌గా కాకుండా, మానవ వనరులను ఉత్పాదక శక్తులుగా మార్చే సాధనంగా చూడాలి” అని ఆయన పేర్కొన్నారు.

గ్రామ స్వరాజ్యంతో విద్యావంతుల భవిష్యత్తుకు కొత్త దిశ

జై స్వరాజ్ పార్టీ ప్రతిపాదిస్తున్న గ్రామ స్వరాజ్యం కేవలం గ్రామాల పరిపాలనకు సంబంధించిన ఆలోచన మాత్రమే కాదని, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువత, పట్టభద్రులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులకు స్థానికంగా అవకాశాలు సృష్టించే సమగ్ర అభివృద్ధి నమూనా అని కాసాని శ్రీనివాసరావు గౌడ వివరించారు.

గ్రామాలకు అధికారాలు, వనరులు, బాధ్యతలు బదలాయించి స్థానిక ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేస్తే ఉపాధి, స్వయం ఉపాధి, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, గ్రామీణ సేవా రంగం, చిన్న వ్యాపారాలు వంటి అనేక అవకాశాలు పెరిగే అవకాశం ఉందన్నారు.

“ప్రతి పట్టభద్రుడు తన ఓటును తన భవిష్యత్తుగా చూడాలి”

పట్టభద్రులు రాజకీయాలను కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే చూడకుండా, విధానాల రూపకల్పనలో తమ పాత్రను గుర్తించాలని ఆయన పిలుపునిచ్చారు.

“మీ డిగ్రీ మీ విద్యకు గుర్తింపు. మీ ఓటు మీ భవిష్యత్తుపై మీ హక్కుకు గుర్తింపు. ఆ హక్కును వదులుకోవద్దు. ప్రతి అర్హత కలిగిన పట్టభద్రుడు ముందుగా తన పేరు ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలి. అనంతరం అభ్యర్థుల విధానాలు, ఆలోచనలు, ప్రజా కార్యక్రమాలను పరిశీలించి తన నిర్ణయం తానే తీసుకోవాలి” అని ఆయన అన్నారు.

రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ

జై స్వరాజ్ పార్టీ రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాల్లో అభ్యర్థులను బరిలోకి దించేందుకు సిద్ధమవుతోందని కాసాని శ్రీనివాసరావు గౌడ తెలిపారు.

విద్యావంతులు, మేధావులు, యువత, ఉద్యోగులు, నిరుద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్న పట్టభద్రులు, గ్రామీణ ప్రాంతాల విద్యావంతులతో విస్తృతంగా చర్చలు నిర్వహించి వారి సమస్యలను ఎన్నికల కార్యాచరణలో భాగం చేస్తామని ఆయన చెప్పారు.

“ఇది కేవలం జై స్వరాజ్ పార్టీ ఎన్నికల కార్యక్రమం కాదు. విద్యావంతుల సమస్యలను ప్రజా చర్చలోకి తీసుకువచ్చే ఒక అవకాశం. మన రాజ్యం మనం ఏలుదాం అనే భావనను ప్రజాస్వామ్య మార్గంలో బలోపేతం చేయడమే మా లక్ష్యం” అని ఆయన తెలిపారు.




విద్యావంతులకు పిలుపు

అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు వెంటనే గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రక్రియపై సమాచారం తెలుసుకుని తన పేరు నమోదు చేసుకోవాలని, ఇప్పటికే నమోదు చేసుకున్న వారు తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని కాసాని శ్రీనివాసరావు గౌడ కోరారు.

“విద్య మనకు జ్ఞానాన్ని ఇచ్చింది.
ఓటు మనకు నిర్ణయాధికారాన్ని ఇస్తుంది.
ఆ నిర్ణయాధికారాన్ని వినియోగిద్దాం.
మన భవిష్యత్తును మనమే నిర్మించుకుందాం.
మన రాజ్యం మనం ఏలుదాం.”
అని ఆయన పిలుపునిచ్చారు.

# మోడల్ యూఎన్ విద్యార్థులకు ఒక పరివర్తనాత్మక అనుభవం

## - ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్ అవినాష్ కొల్ల

**హైదరాబాద్, సెప్టెంబర్ 18:**

నాయకత్వ లక్షణాలు, ప్రపంచ అవగాహన, మరియు జీవితానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడనికి మోడల్ యునైటెడ్ నేషన్స్ ( ఏంయూఎన్) విద్యార్థులకు ఒక పరివర్తనాత్మక అనుభవం అందిస్తుందని ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్ అవినాష్ కొల్ల తెలిపారు. హైదరాబాద్ నగర శివార్లలోని గుండ్లపోచంపల్లి, డీ.ఆర్.ఎస్.ఐ.ఎస్ క్యాంపస్ లో శుక్రవారం నగరంలోని వివిధ స్కూళ్ల విద్యార్థులకు ప్రపంచ సమస్యలపై అవగాహన, విధాన రూపకల్పన, సామాజిక భాగస్వామ్యం, మెరుగైన ప్రపంచం కోసం డీ.ఆర్.ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ “మోడల్ యునైటెడ్ నేషన్స్ ( ఏంయూఎన్) 2026 ను నిర్వహించింది. అవినాష్ కొల్ల ఏంయూఎన్–2026 ను ప్రారంభించి మాట్లాడుతూ మోడల్ యుఎన్ విద్యార్థులను తమను తాము ప్రపంచ సమాజంలో భాగంగా భావించేలా ప్రోత్సహిస్తుందని, భిన్న సంస్కృతుల పట్ల అవగాహన, సానుభూతి మరియు బాధ్యతాయుత భావనలను పెంపొందించడం ద్వారా, తమకు ముఖ్యమైన అంశాలపై చర్యలు చేపట్టేలా మరియు స్థానిక, ప్రపంచ స్థాయిలలో మార్పు తీసుకురాగల తమ శక్తిని గుర్తించేలా విద్యార్థులను ప్రేరేపిస్తుందని తెలిపారు. గౌరవ అతిథిగా పాల్గొన్న యునైటెడ్ డిప్లొమాటిక్ కౌన్సిల్ డైరెక్టర్ మనీష్ పత్తిపాటి



మాట్లాడుతూ మోడల్ యునైటెడ్ నేషన్స్ అనేది ఒక ప్రయాణం అని, ఇది విద్యార్థులు వ్యక్తిగతంగా మరియు మేధోపరంగా ఎదగడానికి, విద్యార్థులు తమ కోసం తాము వాదించుకోవడం, తమ ఆలోచనలను సమర్థించుకోవడం, అలాగే ప్రపంచం గురించి విమర్శనాత్మకంగా ఆలోచించడం నేర్చుకుంటారని తెలిపారు. డీ.ఆర్.ఎస్.ఐ.ఎస్ డైరెక్టర్ డా. అంజనీ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ అంతర్జాతీయ సంబంధాలు, రాజకీయ శాస్త్రం లేదా న్యాయశాస్త్రంపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు, మోడల్ యుఎన్ వారి భవిష్యత్ వృత్తి మార్గాలను నేరుగా ప్రభావితం చేయగల అంశాలు, మార్గదర్శకులు మరియు సంబంధాలను అందిస్తుందని, చాలా మంది పూర్వ విద్యార్థులు తమ ఏంయూఎన్ అనుభవాల నుండి ప్రేరణ పొంది, దౌత్యం, ప్రభుత్వం, న్యాయం మరియు లాభాపేక్షలేని సంస్థల వంటి రంగాలలో విజయవంతమైన వృత్తిని కొనసాగిస్తున్నారని తెలిపారు. డీ.ఆర్.ఎస్.ఐ.ఎస్ ప్రిన్సిపాల్ ఐ. వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులను భాగస్వాములను చేస్తూ, ఐక్యరాజ్యసమితి సూత్రాల గురించి మరియు అది ఎలా పనిచేస్తుందో మరింతగా తెలుసుకోవడానికి డీ.ఆర్.ఎస్.ఐ.ఎస్ ప్రతియేటా మోడల్ యుఎన్ నిర్వహిస్తుందని, ఈ సంవత్సరం హైదరాబాద్ నగరంలోని దాదాపు 15 స్కూళ్ల నుండి 300 మంది విద్యార్థినీవిద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీ.ఆర్.ఎస్.ఐ.ఎస్ డైరెక్టర్లు గర్వ్ అగర్వాల్, సృష్టి అగర్వాల్, వైస్ ప్రిన్సిపాల్ పూజ సక్సేనా, ఏంయూఎన్–2026 అధ్యక్షులు మేరీ తనూజ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జెండా ఆవిష్కరణ, వందేమాతరం సామూహిక గానం





హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 18: తెలంగాణ విమోచన దినోత్సవం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం, వందేమాతరం 150వ వార్షికోత్సవం పురస్కరించుకుని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి హిమాయత్‌నగర్ డివిజన్ కన్వీనర్ గోపిశెట్టి ప్రమోద్ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో జెండా ఆవిష్కరణ, వందేమాతరం సామూహిక గానం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. డివిజన్ పరిధిలోని ల్యాండ్‌మార్క్ 18, జేకేఎం అవెన్యూ, మాతృశ్రీ అపార్ట్‌మెంట్, గాంధీ కుటీర్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన ఈ వేడుకల్లో సమితి సభ్యులు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఖైరతాబాద్ బడా గణేష్ వద్ద ప్రత్యేకంగా జెండా ఆవిష్కరణ చేసి, వందేమాతరం పూర్తి గీతాన్ని సామూహికంగా ఆలపించి దేశభక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజీయూఎస్ ఖైరతాబాద్ అసెంబ్లీ కన్వీనర్ కె. నర్సింగ్ గౌడ్, అసెంబ్లీ కో–కన్వీనర్ గోపి, డివిజన్ కన్వీనర్ గోపిశెట్టి ప్రమోద్, డివిజన్ కో–కన్వీనర్లు ధీరేందర్ బియానీ, మల్లికార్జున్, మహేష్, సంతోష్‌లతో పాటు సమితి సభ్యులు, గణేష్ మండపాల నిర్వాహకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఘనంగా నవరాత్రి ఉత్సవాలు






**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 18:–**

ఇబ్రహీంపట్నం: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ఆవరణలో భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా భక్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కె.వి.పి. రాజు ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని భక్తులకు అన్నప్రసాదం అందించారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో కొనసాగేందుకు పోలీస్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎస్‌హెచ్‌ఓ ఎం. మహేందర్ రెడ్డి, మంచాల ఎస్‌హెచ్‌ఓ మధు, ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ జితేందర్ రెడ్డితో పాటు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ రాజు మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. నిమజ్జనం సమయంలో పోలీసుల సూచనలు పాటిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. పండుగ సందర్భంగా ప్రజల భద్రతకు పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు.

# హైద్రాబాద్ పాతబస్తీ మాదన్నపేటలో డబుల్ మర్డర్స్ కలకలం.......

**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతిదీ ఆదన్నపేట్**





హైదరాబాద్ పాతబస్తీలోని మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. తన కూతురిని వేధించవద్దంటూ మందలించినందుకు హస్మత్(55) అనే వ్యక్తిని పక్కింటి యువకుడు మొహమ్మద్ కత్తితో పొడిచి హతమార్చాడు. అడ్డువచ్చిన హస్మత్ కుమారుడు ఉమర్‌పై కూడా కత్తితో దాడి చేయడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలి స్తుండగా మార్గ మధ్యలో ఉమర్ కూడా మరణించాడుమాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బాగ్–ఎ–జహారా ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. తన కూతురిని వేధిస్తున్నాడంటూ మొహమ్మద్‌ను హస్మత్ మందలించడంతో ఆగ్రహానికి గురైన మొహమ్మద్ అనే యువకుడు ఈ దాడికి పాల్పడినట్లు సమాచారం.కత్తిపోట్లకు గురైన హస్మత్ ఘటనాస్థలంలోనే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన ఉమర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో డాక్టర్లు చికిత్స జరుపుతుండగా మరణించాడు . ఈ సమాచారం అందుకున్న మాదన్న పేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి సిసి కెమెరాల ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు.సంఘటన స్థలానికి చేరుకున్న చార్మినార్ జోన్ డీసీపీ కిరణ్ ఖారే పరిశీలించారు

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
19 సెప్టెంబర్ శనివారం 2026

# ఖేలో ఇండియాకు కయాకింగ్, కెనోయింగ్ ఎంపికలు



**భారతీయ వెలుగు, హైదరాబాద్ (హుస్సేన్‌సాగర్), సెప్టెంబర్ 18:**

రానున్న డిసెంబర్‌లో జరగనున్న ప్రతిష్మాత్మక 'ఖేలో ఇండియా' జాతీయ క్రీడల కోసం తెలంగాణ కయాకింగ్, కెనోయింగ్ జట్ల ఎంపిక పోటీలు శుక్రవారం హుస్సేన్‌సాగర్‌లోని బోట్స్ క్లబ్‌లో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. తెలంగాణ కయాకింగ్ అండ్ కెనోయింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్రాల సంతోష్ సాగర్ ఆధ్వర్యంలో, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) డిప్యూటీ డైరెక్టర్ గోకుల్ పర్యవేక్షణలో ఈ సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించారు.
ఈ ఎంపిక పోటీల్లో ఎస్సీ, ఎస్టీ గిరిజన సంక్షేమ వాటర్ స్పోర్ట్స్ హాస్టల్‌కు చెందిన క్రీడాకారులతో పాటు సివిలియన్ విభాగానికి చెందిన సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కయాకింగ్, కెనోయింగ్ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఖేలో ఇండియా జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. రాష్ట్ర యువ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసి, జాతీయ వేదికలపై పతకాలు సాధించేలా వారిని తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ ఎంపికలు చేపట్టినట్లు నిర్వాహకులు వెల్లడించారు.కార్యక్రమంలో అంతర్జాతీయ క్రీడాకారుడు కృష్ణారావుతో పాటు ఆనందం, సరళ, వినయ్‌రెడ్డి, నిషి, రాజేష్, రాము, పాషా తదితరులు పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

# ఎల్బీనగర్ నియోజకవర్గం :-



వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని లెక్చరర్స్ కాలనీ, హయత్‌నగర్, హస్తినాపురం, మన్సూరాబాద్ డివిజన్లలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన సీనియర్ నాయకులు జక్కిడి ప్రభాకర్ రెడ్డి గారు.అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాలు ప్రజల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని, ఆ విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో లెక్చరర్స్ కాలనీ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కళ్ళెం నరసింహారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎర్ర మహేందర్, ఇరిగి రమేష్, కళ్యాణ్, సుక్క వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ తన డిగ్రీలు చూపించరు .. డిగ్రీలు ఉన్న యువతకు ఉద్యోగాలు ఇవ్వరు.

ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ.. యువతకు ఉద్యోగాలు కల్పించకుండా మోసం చేశారు.యువతను మోసం చేసిన మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని రాహుల్ గాంధీ గారి ఆదేశాల మేరకు జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ భాను చిబ్ గారి ఆధ్వర్యంలో చేపట్టిన "మేరీ డిగ్రీ కా క్యా?" కార్యక్రమంలో భాగంగా గాంధీభవన్‌లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి గారు రాష్ట్ర ఇంచార్జ్ ఖాలీద్ గారితో కలిసి మాట్లాడారు.దేశంలో ఖాళీగా ఉన్న 50 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను సంవత్సరం లోపు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.
లేనిపక్షంలో వచ్చే మోదీ జన్మదినం నాడు ప్రధాని నివాసంతో పాటు రాష్ట్రంలోని కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీల నివాసాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.

# కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ రెండోరోజూ సర్వే.. 388 ఎకరాలపై అధికారుల దృష్టి



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో రెవెన్యూ అధికారుల భూ సర్వే రెండో రోజూ కొనసాగింది. సిద్దిపేట జిల్లా మార్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలోని ఫామ్‌హౌస్‌ను ఆనుకొని ఉన్న భూములను అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఎర్రవల్లి, వెంకటాపూర్, వరదరాజపూర్ గ్రామాల సరిహద్దుల్లో విస్తరించి ఉన్న సర్వే నంబర్ 325లోని 388 ఎకరాల భూములపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. గురువారం ఈ మూడు గ్రామాల సరిహద్దులను గుర్తించిన బృందాలు, రెండో రోజైన శుక్రవారం ఆ భూములకు సంబంధించిన పాత రైతుల వివరాలను, ప్రస్తుత రెవెన్యూ రికార్డులను సేకరించాయి.ఏడీ సుదర్శన్ రాథోడ్, డీఐ సేవియా నాయక్ పర్యవేక్షణలో నాలుగు ప్రత్యేక బృందాలు ఈ సర్వే ప్రక్రియను నిర్వహించాయి. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారం, రెవెన్యూ రికార్డుల ఆధారంగా అధికారులు సమగ్ర నివేదికను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. అయితే, ఈ సర్వే చేపట్టడానికి గల కచ్చితమైన కారణాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

# ఐదవ రోజు ఘనంగా గణపయ్యకు పూజలు

## శ్రీకరి జ్యువెలర్స్, పాన్ బ్రోకర్స్ పూర్తి సహకారంతో మార్కెట్ యార్డ్ వినాయకుడి ఏర్పాటు

## ముఖ్య అతిగా హాజరైన కౌడిపల్లి సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్, ఎస్సై అమరేందర్ రెడ్డి





**కౌడిపల్లి హైదరాబాద్ ఎస్టేట్ సెప్టెంబర్ 18**

మెదక్ జిల్లా మండల కేంద్రమైన కౌడిపల్లి మార్కెట్ యార్డులో శ్రీకరి జ్యువెలర్స్ సహకారంతో ఏర్పాటు చేసిన గణనాధునికి శుక్రవారం 5వ రోజు కావడంతో శ్రీకరి జ్యువెలర్స్ యజమాని ఆవుసుల నాగరాజు చారి, శివాని దంపతులు పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కౌడిపల్లి మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు, మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు, కౌడిపల్లి సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామ పురోహితులు కొలచాల సుమన్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్,కి నాగరాజు దంపతులు మార్కెట్ యార్డ్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఉప సర్పంచ్ శ్వేతా మల్లికార్జున్ గౌడ్, వార్డు సభ్యులు సందీప్, హరీష్, ఎస్సై అమరేందర్ రెడ్డి,కి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్, మాట్లాడుతూ... మార్కెట్ యార్డ్ గణేష్ ఉత్సవ కమిటీ తరఫున కౌడిపల్లి మార్కెట్ యార్డులో మొట్ట మొదటిసారిగా శ్రీకరి జ్యువెలర్స్, పూర్తి సహకారంతో గణేషుడిని ఏర్పాటు చేయడం సంతోషకరమని శ్రీకరి జ్యువెలర్స్ యజమాని నాగరాజు చారిని అభినందించారు. ఇలాగే గ్రామంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలకు దాతలు ముందుకొచ్చి మండపాల నిర్మాణం నుంచి నిమజ్జనం వరకు అందరూ కలిసి చేయి చేయి కలిపి భక్తిశ్రద్ధలతో గణేశుడిని ఏర్పాటు చేసుకొని నవరాత్రులు పూజలు అందించి నిమర్జనానికి ఎలాంటి లోటు పాట్లు కలగకుండా పోలీసుల ఆంక్షల మేరకు నిమజ్జనాలు చేసుకోవాలన్నారు. అనంతరం నాగరాజు చారి, మాట్లాడుతూ... నేను అన్నిటికంటే ఎక్కువగా దైవాన్ని నమ్ముతా ఆ భగవంతుడు నాకు కలిగించిన దాంట్లో కొంత భగవంతుడి ఆరాధన కోసం ఖర్చు చేయడంలో నామనసుకు మానసిక ప్రశాంతత దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఉపసర్పంచ్ శ్వేతా మల్లికార్జున్ గౌడ్, వార్డు సభ్యులు సందీప్ కుమార్, హరీష్, దశరథ్, యాదగిరి, డాక్టర్ శ్రీనివాస్, సాయి చరణ్, నవీన్, డాకయ్య, మనీష్, నాని,తోపాటు పోలీస్ అధికారులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# అంజనీపుత్ర ఎస్టేట్ ఆధ్వర్యంలో ఘనంగా గణనాథుని ఉత్సవాలు

**హైదరాబాద్ ఎస్టేట్ 18 సెప్టెంబర్**

మంచిర్యాల పట్టణంలోని చున్నంబట్టివాడ 100 ఫీట్ రోడ్డులో అంజనీపుత్ర ఎస్టేట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయకుడిని మంచిర్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ అంజనీపుత్ర ఎస్టేట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కాలనీవాసులంతా ఐక్యంగా ఒకచోట చేరి ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో ఐకమత్యం, సోదరభావాన్ని పెంపొందించడంతోపాటు ప్రశాంత వాతావరణానికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తొమ్మిది రోజులపాటు నిరంతరంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా సమాజంలో ఐక్యత, సద్భావన మరింత పెరుగుతాయని ఆకాంక్షించారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్న నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీవాసులు, భక్తులను అభినందించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో తనను భాగస్వామిని చేసి స్వామివారి సేవలో పాల్గొనే అవకాశం కల్పించిన అంజనీపుత్ర ఎస్టేట్ చైర్మన్ గుర్రాల శ్రీధర్‌కు ఆర్‌డీఓ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంజనీపుత్ర ఎస్టేట్



నిర్వాహకులు, కాలనీ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని, ఎంపీ కడియం కావ్య

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ జెండా ఆవిష్కరణ..

**హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ**
తేదీ :17/09/2026-గురువారం
డీసీసీ భవన్,హనుమకొండ.

ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి గారి ఆధ్వర్యంలో డీసీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన వేడుకలకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి కడియం కావ్య, శాసన మండలి సభ్యులు శ్రీ బస్వరాజు సారయ్య, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ తదితరులు హాజరయ్యారు.
ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి గారు జాతీయ జెండాను ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజా పాలన దినోత్సవం ప్రాధాన్యతను గుర్తు చేసుకుంటూ సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ.. హైదరాబాద్ సంస్థానం రజాకారుల పాలన నుంచి విముక్తి పొంది భారతదేశంలో విలీనమవడానికి ఎందరో మహనీయులు చేసిన త్యాగాలు, పోరాటాలు కీలకమని అన్నారు. నాటి స్వాతంత్ర్య పోరాటం నుంచి హైదరాబాద్ విమోచన ఉద్యమం వరకు ప్రజల హక్కుల కోసం అనేక మంది ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేశారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాతావరణంలో ప్రజాస్వామ్య పద్ధతిలో వేడుకలు జరుపుకుంటున్నామని పేర్కొన్నారు.చరిత్రను వక్రీకరించి రాజకీయ ప్రయోజనాల కోసం తమ పాత్రను చాటుకునే ప్రయత్నాలు చేయడం సరికాదని ఎమ్మెల్యే అన్నారు. హైదరాబాద్ సంస్థానం విముక్తి కోసం జరిగిన పోరాటంలో కాంగ్రెస్ పార్టీతో పాటు అనేక మంది నాయకులు, ప్రజలు కీలక పాత్ర పోషించారని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి నేటి వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించిందని పేర్కొన్నారు.ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు అన్నారు. చరిత్రను గౌరవిస్తూ, త్యాగధనుల స్ఫూర్తితో ప్రజా సేవలో ముందుకు సాగాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, నగర నాయకులు, ప్రజా ప్రతినిధులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# కడప జిల్లాకు కేంద్రం గుడ్ న్యూస్..

## రూ.304 కోట్లతో కొత్త హైవే

ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్ కడప జిల్లా పారిశ్రామిక ప్రగతికి కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామిక ప్రాంతాన్ని కడప బైపాస్‌కు అనుసంధానించేలా 4-లేన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి రూ.304.44 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా వివరాలను వెల్లడించారు.ఈ ప్రాజెక్టులో భాగంగా 5.8 కిలోమీటర్ల పొడవున 'యాక్సెస్ కంట్రోల్డ్ హైవే'ను నిర్మించనున్నారు. ఇందులో ఒక ట్రంపెట్ ఇంటర్‌ఛేంజ్, రెండు భారీ వంతెనలు, నాలుగు వెహిక్యులర్ అండర్‌పాస్‌లను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు ప్రస్తుతం ఉన్న కడప బైపాస్‌ను కూడా పటిష్ఠమైన షోల్డర్స్‌తో అభివృద్ధి చేయనున్నారు. ఈ చర్యల వల్ల పారిశ్రామిక ప్రాంతానికి రవాణా సౌకర్యాలు మెరుగుపడి, వాహనాల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో అనుసంధానతను బలోపేతం చేయడంలో ఈ రహదారి కీలక పాత్ర పోషించనుంది. అంతేకాకుండా, కడప నగరంలో ట్రాఫిక్ రద్దీని గణనీయంగా తగ్గించడానికి ఇది దోహదపడుతుంది. 'ప్రధాని గతిశక్తి' కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ఈ ప్రాజెక్ట్, ప్రాంతీయ ఆర్థిక వృద్ధికి ఊతమిస్తుందని కేంద్రం భావిస్తోంది. కొప్పర్తి పారిశ్రామిక హబ్ శరవేగంగా అభివృద్ధి చెందడానికి ఈ కొత్త రహదారి ఒక మైలురాయిగా నిలుస్తుందని



నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# సాయుధ పోరాటంతో సంబంధంలేని మతోన్మాదులకు మాట్లాడే హక్కు లేదు

## - కమ్యూనిస్టులే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసులు - పాలడుగు భాస్కర్

**- హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి హైదరాబాద్**
-
సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు
మేడ్చల్ జిల్లా బాచుపల్లి మండల పరిధిలోని రాజీవ్ గృహకల్ప శాఖ ఆధ్వర్యంలో,గురువారం సాయంత్రం,వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలలో భాగంగా సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్ అధ్యక్షతన సభ నిర్వహించారు.ఈ సభను ఉద్దేశించి కామ్రేడ్ పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ,... తెలంగాణలో ఆనాటి పాలకుడు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని అన్నారు. బ్రిటిష్ పాలకులు భారతదేశ సంపదను, వనరులను దోచుకుంటున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా జరిగిన ఉద్యమాల ఫలితంగా బ్రిటిష్ పాలకులు భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.అయితే భారతదేశంలోని కొన్ని సంస్థానాలు భారత యూనియన్‌లో విలీనం కావడానికి అంగీకరించలేదని, తెలంగాణ ప్రాంతంలో ప్రజలను వెట్టిచాకిరీ పేరుతో తీవ్రంగా అణిచివేతకు గురిచేస్తున్న నేపథ్యంలో దీనికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రజలు ఆయుధాలు చేతబట్టి పోరాడుతున్న సందర్భంలో దొడ్డి కొమరయ్యను హత్య చేశారని, అనంతరం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య తదితర కమ్యూనిస్టు నాయకుల నాయకత్వంలో ఈ పోరాటం సాయుధ పోరాటంగా రూపుదిద్దుకుందని అన్నారు."దున్నేవాడికే భూమి" అనే నినాదంతో కమ్యూనిస్టులు ప్రజలను సమీకరించి పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. ఈ పోరాటంలో సుమారు 4,000 మంది అమరులయ్యారని, సుమారు 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచినట్లు పేర్కొన్నారు.
ఈ పోరాటాన్ని అణచివేయడానికి నిజాం సైన్యం, రజాకారులు ప్రజలపై దాడులు, నిర్బంధాలు, హింసకు పాల్పడ్డారని అన్నారు. అయినప్పటికీ ప్రజలు వెనకడుగు వేయకుండా పోరాటాన్ని కొనసాగించారని తెలిపారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని అన్నారు.
తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని నేటి పాలకులు, ముఖ్యంగా బీజేపీ, మతాల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారని పాలడుగు భాస్కర్ విమర్శించారు. ఈ పోరాటంలో తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలకు చెందిన అనేకమంది నాయకులు, ప్రజలు పాల్గొన్నారని అన్నారు. చాకలి ఐలమ్మ భూమి కోసం ప్రారంభించిన పోరాటం విస్తృత ప్రజా ఉద్యమంగా మారిందని, అనేకమంది జమీందారులు, దేశ్‌ముఖ్‌లు, భూస్వాముల గడీలను ప్రజలు ఎదిరించారని గుర్తు చేశారు. ఈ పోరాటంలో హిందువులు, ముస్లింలు, వివిధ కులాలకు చెందిన ప్రజలు ఐక్యంగా పాల్గొన్నారని అన్నారు. బందగి, షోయాబుల్లా ఖాన్, దొడ్డి కొమరయ్య తదితరులు అమరులయ్యారని తెలిపారు.తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో బీజేపీ, ఆర్‌ఎస్ఎస్ వంటి మతోన్మాద శక్తులకు ఎలాంటి పాత్ర లేదని ఆయన అన్నారు. అందువల్ల ఈ పోరాట చరిత్రను వక్రీకరించే హక్కు వారికి లేదని పేర్కొన్నారు.ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో పాలకులు ప్రజా ఉద్యమాలను అణచివేసే విధానాలను అవలంబిస్తున్నారని అన్నారు. పోరాటం చేస్తున్న ప్రజలను వివిధ పేర్లతో అరెస్టులు చేయడం, నిర్బంధించడం, ప్రజా వ్యతిరేక చట్టాలను తీసుకురావడం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో భవిష్యత్తులో జరిగే ప్రజా పోరాటాల్లో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.సాయుధ పోరాట స్ఫూర్తితో నూతన పోరాటాలకు సిద్ధం కావాలిసీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ వెంకటేష్ మాట్లాడుతూ,.....దాదాపు ఆరు సంవత్సరాల పాటు సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం దేశంలో, ప్రపంచంలో అనేక మార్పులకు దోహదపడిందన్నారు. "దున్నేవానికే భూమి" అనే నినాదంతో సాగిన పోరాటం ద్వారా సుమారు 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచడం జరిగిందన్నారు.
ఆ తర్వాతి కాలంలో కమ్యూనిస్టులు పెద్ద సంఖ్యలో పార్లమెంట్ సభ్యులుగా గెలిచారని, మద్రాసు అసెంబ్లీలో కూడా కమ్యూనిస్టులకు గణనీయమైన ప్రాతినిధ్యం లభించిందని తెలిపారు. వెట్టిచాకిరీ, కుల వివక్ష, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు అనేక పోరాటాలు నిర్వహించారని



అన్నారు.ప్రస్తుతం ఎదురవుతున్న కొత్త ప్రమాదాలను ఎదుర్కొనేందుకు కార్మికులు, రైతులు, యువత, విద్యార్థులు, మహిళలు ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సమ్మెలు, ఆందోళనలు ప్రజా పోరాటాల ఫలితంగా విజయవంతమవుతున్నాయని తెలిపారు.
వ్యవసాయ రంగం, జాతీయ ఉపాధి రంగంలో తీసుకువస్తున్న ప్రజా వ్యతిరేక చట్టాలను, కార్మిక రంగంలో తీసుకువస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను తిప్పికొట్టేందుకు ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళలు, విద్యార్థులు నిర్వహిస్తున్న ఆందోళనలకు మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.
వెట్టిచాకిరీ రూపం మారింది దోపిడీ మాత్రం కొనసాగుతోంది
సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ పి. సత్యం మాట్లాడుతూ ....1946- 1951 లో ప్రారంభమైన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కుల, మతాలకు అతీతంగా ప్రజలు పాల్గొన్నారని అన్నారు. ఈ పోరాటంలో ఆర్‌ఎస్ఎస్, కాంగ్రెస్ పాత్ర లేదని పేర్కొన్నారు. కొంతమంది జమీందారులు, జాగీర్దారులు, దేశ్‌ముఖ్‌లకు మద్దతుగా నిలిచిన శక్తులు ఉన్నాయని అన్నారు.కీలకమైన భూ సమస్యపై ప్రజలంతా




పాలడుగు భాస్కర్ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

ఐక్యంగా పోరాటం చేశారని తెలిపారు. ప్రస్తుతం వెట్టిచాకిరీ రూపం మారిందని, పని గంటలను పెంచడం, కార్మికుల శ్రమను దోపిడీ చేయడం ద్వారా కంపెనీలు కార్మికులపై భారాన్ని మోపుతున్నాయని అన్నారు.
ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో భవిష్యత్తులో ప్రజా పోరాటాలను నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఈ దిశగా కమ్యూనిస్టులు, ప్రజానీకం ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో బాచుపల్లి సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కామ్రేడ్ బి. వెంకట్రామయ్య, రాజీవ్ గృహకల్ప శాఖ కార్యదర్శి ఎన్. బాలపీర్, మండల కమిటీ సభ్యులు బాల వెంకటేశ్వరరావు, కృష్ణయ్య, వెంకట్రాజ్యం, నాగభూషణ్, పి. స్వామి, పి. భాస్కర్, పెంటయ్య, పి. శ్రావణ్ కుమార్, శంకర్, సుదర్శన్, ఇషాక్, భానుప్రియ, నాగశేషి, అంజనమ్మ, ప్రజాసంఘాల నాయకులు, సీపీఐ(ఎం) నాయకులు, సానుభూతిపరులు తదితరులు పాల్గొన్నారు.

### రేపు సాయంత్రానికి అండమాన్ ప్రాంతంలో అల్పపీడనం..

# ఏపీలో వర్షాలు



బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని, దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. ఉత్తర అండమాన్ పరిసరాల్లో ఉన్న ఉపరితల ఆవర్తనం రేపు (సెప్టెంబరు 19) సాయంత్రం నాటికి అల్పపీడనంగా మారే సూచనలున్నాయని ఏపీఎస్డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు.
ఈ అల్పపీడనం క్రమంగా బలపడి, రానున్న మూడు నాలుగు రోజుల్లో పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందని ఆయన వివరించారు. దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటాయని అంచనా వేస్తున్నారు.శనివారం రోజున మన్యం, అల్లూరి, పోలవరం, కాకినాడ, తూర్పుగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ తెలిపింది. మిగిలిన జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి జల్లులు పడతాయని పేర్కొంది.ఈ నేపథ్యంలో, వర్షాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు, పశువుల కాపరులు చెట్ల కింద ఆశ్రయం పొందవద్దని హెచ్చరించింది.

# మోడలింగ్‌లో మహి మెరుపులు..

## పేజెంట్ టైటిల్‌తో కొత్త అడుగు

**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువకుడు మహి మోడలింగ్, పేజెంట్ రంగంలో తనదైన గుర్తింపు కోసం అడుగులు వేస్తున్నారు. చిన్నప్పటి నుంచే ఫ్యాషన్, మోడలింగ్‌పై ఆసక్తి పెంచుకున్న మహి.. ప్రస్తుతం తన కెరీర్‌ను కొనసాగిస్తూనే మోడలింగ్, పేజెంట్స్‌లోనూ ముందుకు సాగుతున్నారు.

చదువు పూర్తయ్యాక తన కెరీర్‌తో పాటు మోడలింగ్‌పై ఉన్న ప్యాషన్‌ను కొనసాగించడం కొంత సవాలుగా అనిపించినప్పటికీ.. కుటుంబం అందించిన ప్రోత్సాహం మహికి ఎంతో ధైర్యాన్ని ఇచ్చింది. ముఖ్యంగా తన తల్లి అందించిన సహకారం, కుటుంబ సభ్యుల అండతో తన కలల దిశగా అడుగులు వేయగలిగానని మహి తెలిపారు.

పేజెంట్ జర్నీలో ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నానని, ఈ ప్రయాణం తనలో ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచిందని మహి చెప్పారు. తాను సాధించిన ఈ టైటిల్ తనకు ఎంతో ప్రత్యేకమైనదని, భావోద్వేగంతో కూడిన మరపురాని క్షణమని పేర్కొన్నారు.

తన ప్రయాణంలో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ మహి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా తనకు ఈ మంచి అవకాశాన్ని అందించిన వెవెంట్జ్ టీమ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి, ప్రతి అడుగులోనూ ప్రోత్సహించిన కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు.

మోడలింగ్‌తో పాటు పేజెంట్ రంగంలోనూ మరిన్ని అవకాశాలను అందిపుచ్చుకుని తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడమే తన లక్ష్యమని మహి తెలిపారు.










